తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ విద్యా సమరానికి సంబంధించి ఇంటర్ విద్యాశాఖ కార్యదర్శి కృష్ణ ఆదిత్య అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని మౌలిక వసతులను కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈసారి పరీక్షా కేంద్రాల్లోకి నిర్ణీత సమయం కంటే 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు రికార్డు స్థాయిలో విద్యార్థులు హాజరవుతున్నారు. ప్రథమ సంవత్సరంలో 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,07,949 మంది చొప్పున మొత్తం 9,97,075 మంది విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. విద్యార్థుల రవాణా సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు మరియు అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. పరీక్షల్లో పారదర్శకత కోసం ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు, గోడ గడియారాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్ల నిఘాను కట్టుదిట్టం చేశారు.

పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. మానసిక ఆవేదనను అధిగమించేందుకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చేలా 14416, 80693 91416 నంబర్లను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు ఈ నంబర్లకు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవడమే కాకుండా మానసిక ధైర్యాన్ని పొందవచ్చని కృష్ణ ఆదిత్య సూచించారు. విద్యార్థులు ప్రశాంత చిత్తంతో పరీక్షలు రాయాలని, చివరి నిమిషంలో కంగారు పడకుండా అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఆయన కోరారు. హోలీ పండుగ దృష్ట్యా పరీక్షా షెడ్యూల్‌లో చేసిన చిన్న మార్పులను విద్యార్థులు గమనించాలని సూచించారు.

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం మరో భారీ అడుగు వేసింది. ఒక్కో గురుకులానికి సుమారు రూ. 50 కోట్లు కేటాయించి, వాటిని కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా అత్యాధునిక తరగతి గదులు, డిజిటల్ ల్యాబ్‌లు, ఆధునిక వంటశాలలు మరియు వసతి గృహాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ వసతులు అందించడమే లక్ష్యంగా 'యంగ్ ఇండియా స్కూల్స్' పేరిట ఈ విప్లవాత్మక మార్పులు చేపట్టబోతున్నారు.

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఇటీవలి జేఈఈ మెయిన్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరచడం గమనార్హం. ఈ స్ఫూర్తితోనే ప్రభుత్వం గురుకులాల్లో మరిన్ని పరిపాలనాపరమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల హాజరు, ఆరోగ్యం, విద్యా ప్రగతిని పర్యవేక్షించేందుకు 24 మాడ్యూళ్లతో కూడిన ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించబోతున్నారు. ఐదు కొత్త వృత్తి విద్యా కళాశాలల ఏర్పాటు ద్వారా అగ్రికల్చర్, నర్సింగ్, ఫార్మసీ వంటి రంగాల్లో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించనున్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని బోర్డు హెచ్చరించింది. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను కేంద్రాల్లోకి అనుమతించబోరు. పరీక్షా పత్రాల భద్రత కోసం ప్రతి పేపర్‌పై ప్రత్యేక క్యూఆర్ కోడ్, సీరియల్ నంబర్లను ముద్రించారు. విద్యార్థుల హాల్ టికెట్లు వాట్సాప్ మరియు వెబ్‌సైట్ ద్వారా ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు మార్చి 18 వరకు కొనసాగనున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ ముందస్తు చర్యలు ప్రశంసనీయమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం రవాణా సౌకర్యాలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించింది. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల వల్ల విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా తమ పరీక్షలను రాయవచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# కూలుతున్న నిరుపేదల గూడు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జిల్లా కేంద్రానికి సమీపంలోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో గల వినోభానగర్ భూదాన్ భూముల వివాదం మరోసారి రాజకీయ, సామాజిక చిచ్చుగా మారింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే సుమారు నాలుగు జిల్లాలకు చెందిన 2,000 మంది పోలీసు బలగాలు ఒక్కసారిగా మోహరించడంతో ఈ ప్రాంతం యుద్ధ ప్రాతిపదికన పోలీసుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఎటు చూసినా భారీ బందోబస్తు, జేసీబీల శబ్దాల మధ్య దశాబ్ద కాలంగా నివాసం ఉంటున్న నిరుపేదల గూడు ఒక్కొక్కటిగా నేలమట్టమవుతోంది. దశాబ్ద కాలంగా కొనసాగుతున్న ఈ భూ వివాదం ఇప్పుడు బాధితుల కన్నీటి పర్యంతానికి, అధికారుల కఠిన చర్యలకు వేదికగా మారింది. ఈ వివాదానికి మూలాలు దశాబ్దాల క్రితం ఆచార్య వినోబా బావే చేపట్టిన భూదాన్ ఉద్యమంలో ఉన్నాయి. 1951 1955 మధ్య కాలంలో రాయల కోటేశ్వరరావు అనే భూస్వామి, వినోబాబావే ఆశయాలకు ప్రభావితమై నిరుపేదల సంక్షేమం కోసం 62.7 ఎకరాల భూమిని భూదాన్ బోర్డుకు అప్పగించారు. సర్వే నెంబర్లు 147, 148, 149, 160లలో విస్తరించి ఉన్న ఈ భూములు అప్పట్లో ముంతఖబ్‌లలో నమోదయ్యాయి. అయితే నగర విస్తరణతో ఈ భూమి విలువ ఇప్పుడు కోట్లాది రూపాయలకు చేరడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తుల కన్ను దీనిపై పడింది. తప్పుడు పత్రాలు సృష్టించి అమాయక ప్రజలకు విక్రయించడంతో అసలు సమస్య మొదలైంది.




ప్రస్తుతం కూల్చివేతలు ఎదుర్కొంటున్న బాధితుల వాదన మరోలా ఉంది. 2014లో అప్పటి భూదాన్ బోర్డు తమకు నిబంధనల ప్రకారమే 100 గజాల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని, అందుకే తాము నివాసాలు ఏర్పరచుకున్నామని వారు ఘంటాపథంగా చెబుతున్నారు. ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు అక్రమ కట్టడాలంటూ కూల్చడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరును నిరసిస్తూ బాధితులు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని నిరసనకారులు భీష్మించుకుని కూర్చున్నారు. మరోవైపు జిల్లా యంత్రాంగం వాదన ప్రకారం.. భూదాన్ భూములను విక్రయించడం లేదా ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరం. కొందరు మధ్యవర్తులు పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని, అక్రమంగా డబ్బులు వసూలు చేసి వారిని ఇక్కడ నివాసాలు ఉండాలని రెచ్చగొడుతున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. కోర్టులో ఉన్న కేసుల ప్రకారం కేవలం తొమ్మిది ఇళ్లకు మాత్రమే చట్టపరమైన అనుమతులు ఉన్నాయని, మిగిలిన 200కు పైగా నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టినవేనని వారు స్పష్టం చేస్తున్నారు. అందుకే కోర్టు ఆదేశాల మేరకు అక్రమ ఆక్రమణలను తొలగిస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

గతంలోనూ ఈ ప్రాంతంలో పలుమార్లు ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. 2023 జూలైలో రాత్రికి రాత్రే వందలాది మంది గుడిసెలు వేయడం, వాటిని తొలగించడానికి వచ్చిన పోలీసులపై ఆందోళనకారులు కర్రలతో తిరగబడటం సంచలనం సృష్టించింది. ఆ సమయంలో జరిగిన లాఠీచార్జిలో పలువురు గాయపడ్డారు. మళ్ళీ 2024 ఆగస్టులో కూడా ఇక్కడి షెడ్ల తొలగింపు సమయంలో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. తాజాగా మంగళవారం జరిగిన చర్యలో ఏకంగా నాలుగు జిల్లాల పోలీసులను రప్పించడం చూస్తుంటే, ప్రభుత్వం ఈ ఆక్రమణలను శాశ్వతంగా తొలగించాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రజల నుంచి ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రధాన ప్రశ్న.. "ఇన్ని ఏళ్లుగా ఇళ్లు కట్టుకుంటున్నప్పుడు అధికారులు ఏం చేస్తున్నారు?" అని. పేదలు గుడిసెలు వేసుకుంటున్నప్పుడు, విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్నప్పుడు స్పందించని రెవెన్యూ యంత్రాంగం, ఇప్పుడు వారంతా స్థిరపడిన తర్వాత ఇలా కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఆరంభంలోనే అడ్డుకుని ఉంటే తమకు ఇంత ఆస్తి నష్టం జరిగేది కాదని, తప్పుడు పట్టాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోకుండా తమపై పడటం ఏంటని వారు నిలదీస్తున్నారు. ఈ భూ వివాదం రాజకీయంగా కూడా పెద్ద చర్చకు దారితీస్తోంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వచ్చి ఈ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, క్రమబద్ధీకరణ చేస్తామని హామీలు గుప్పించి ఓట్లు వేయించుకున్నారని బాధితులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు తీరా కష్టకాలం వచ్చేసరికి ఏ ఒక్క నాయకుడు కూడా తమకు అండగా నిలవడం లేదని వారు వాపోతున్నారు. అధికారుల చర్యలకు రాజకీయ నాయకుల మద్దతు కూడా ఉండటంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వినోభానగర్ నివాసితులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఖమ్మం నగరం చుట్టుపక్కల ఉన్న భూదాన్ భూములపై గతంలోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. భూదాన్ యజ్ఞ బోర్డు భూములను పేదలకు పంపిణీ చేయడంలో జరిగిన జాప్యం, రికార్డుల నమోదులో ఉన్న లోపాలను అక్రమార్కులు ఆసరాగా చేసుకుంటున్నారు. దశాబ్దాల క్రితం దానం చేసిన భూమికి సంబంధించిన స్పష్టమైన సరిహద్దులు లేకపోవడం కూడా వివాదానికి కారణమవుతోంది.

## బస్తీల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి వినతి

**సికింద్రాబాద్, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియూసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తార్నాక డివిజన్‌కు సంబంధించిన పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు బస్తీల విలీన అంశం, అలాగే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఉన్న తొమ్మిది బస్తీలకు సంబంధించి డబుల్ బెడ్ రూమ్ గృహాల సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు ముఖ్యమంత్రిని కోరారు.అదే విధంగా తార్నాక డివిజన్‌లోని విజయ డైరీ క్వార్టర్స్ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, విద్యా సదుపాయాలను మెరుగు పరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో పాఠశాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల ప్రభుత్వ స్కూల్ ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు లభిస్తాయని వారు వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి , డబుల్ బెడ్‌రూమ్ గృహాల సమస్యతో పాటు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుపై తక్షణమే సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, తార్నాక డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు.



# నీటి హక్కులపై బీఆర్ఎస్‌కు మాట్లాడే అర్హత లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ రాష్ట్ర హక్కులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని, సాగునీటి విషయంలో రాష్ట్రానికి చారిత్రక ద్రోహం చేసిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండలం జానపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న 'జవహర్ జానపహాడ్ ఎత్తిపోతల పథకం' పనులను మంత్రి స్వయంగా సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి హక్కుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని, వారి హయాంలో జరిగిన తప్పిదాల వల్లే దక్షిణ తెలంగాణ రైతాంగం నేడు నీటి కొరతతో అల్లాడుతోందని ధ్వజమెత్తారు. కృష్ణా నది సాక్షిగా తాను ప్రమాణం చేసి చెబుతున్నానని, తెలంగాణకు దక్కాల్సిన ఒక్క నీటి బొట్టును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వదులుకోదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని తేల్చి చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను ఒక 'చీకటి దశ'గా ఆయన అభివర్ణించారు. ఆనాడు చూపిన నిర్లక్ష్యం వల్లే అనేక ప్రాజెక్టులు కుంటుపడ్డాయని, రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నీటిపారుదల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని, దానికి రికార్డు స్థాయిలో పెరిగిన ధాన్యం దిగుబడే సాక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు నెట్టెంపాడు, కోయిలసాగర్, ఎస్ఎల్‌బీసీ, డిండి, ప్రతిష్టాత్మక పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా నీరందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న తరహా ఎత్తిపోతల పథకాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. జానపహాడ్ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత రైతుల సాగునీటి కల సాకారం చేస్తామని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనుల వేగం పెంచి, నాణ్యతలో రాజీ పడకూడదని మంత్రి స్పష్టం చేశారు.

ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం వహిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్లను, అధికారులను మంత్రి హెచ్చరించారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమైందని, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన కృష్ణా నదిపై తమకు ఉన్న హక్కులను కాపాడుకోవడంలో ఏ శక్తినీ అడ్డురానివ్వబోమని చెప్పారు. సాగునీటి రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన అజెండా అని వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, తద్వారా స్థానిక రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నీటి కేటాయింపుల విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న వివాదాలపై కూడా మంత్రి స్పందించారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా గట్టిగా అడ్డుకుంటామన్నారు. అంతర్రాష్ట్ర జల వివాదాలను పరిష్కరించుకుంటూనే, మన వాటాను దక్కించుకోవడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. గత పాలకులు కేంద్రంతో కుమ్మక్కై రాష్ట్ర హక్కులను పణంగా పెట్టారని, అందుకే నేడు మనకు ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అనుమతులను సాధించుకుంటున్నామని పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటితో పాటు ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధర కల్పనలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని ఉత్తమ్ చెప్పారు. ధాన్యం సేకరణలో గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డులు సృష్టిస్తున్నామని, పౌర సరఫరాల శాఖ ద్వారా రైతులకు సకాలంలో చెల్లింపులు జరుపుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు కేవలం ఉనికి కోసమేనని, క్షేత్రస్థాయిలో ప్రజలందరికీ వాస్తవాలు తెలుసని ఎద్దేవా చేశారు. జానపహాడ్ వంటి చిన్న ఎత్తిపోతల పథకాలు కూడా పూర్తి కాకపోవడానికి గత పాలకుల అసమర్థతే కారణమని మరోసారి గుర్తుచేశారు. పాలమూరు బిడ్డలకు న్యాయం చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పునరుద్ఘాటించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నీటిని విడుదల చేస్తామన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా అధికారులను నియమించామని, తాను స్వయంగా ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. నల్గొండ జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే వరకు విశ్రమించబోమని గట్టిగా చెప్పారు. రైతులకు భరోసా ఇవ్వడమే కాకుండా, వారి కష్టాలను తీర్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

జానపహాడ్ ఎత్తిపోతల పథకం పర్యటనలో భాగంగా మంత్రి స్థానిక రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కాలువల నిర్మాణం, భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరును ఆదేశించారు. నిధుల కొరత లేదని, కేవలం పని వేగవంతం కావాలని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని పిలుపునిచ్చారు. చివరగా, రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి రంగం కీలకమని, అందుకే బడ్జెట్‌లో దీనికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. నీటి చుక్క కోసం గతంలో జరిగిన ఉద్యమాలను గుర్తు చేసుకుంటూ, ఆ ఆకాంక్షల మేరకు పాలన అందిస్తామన్నారు. తెలంగాణ వికాసం సాగునీటితోనే సాధ్యమని, అందుకే ప్రతి ప్రాజెక్టును ఒక యజ్ఞంలా పూర్తి చేస్తామని చెప్పారు. మంత్రి పర్యటనతో స్థానిక రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. జానపహాడ్ ప్రాంతంలో సాగునీటి కష్టాలు త్వరలోనే తీరనున్నాయన్న ధీమా వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో నీటిపారుదల శాఖలో మరిన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నామని, ప్రతి నీటి బొట్టుకు లెక్క ఉండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. కాలువల నిర్వహణ, ఆయకట్టు స్థిరీకరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామన్నారు. నీటి హక్కుల పరిరక్షణలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు , నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండు నెలల పసికందు మృతి ఘటనపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆగ్రహం

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** కులహంకారంతో రెండు నెలల పసికందు ప్రాణాలు కోల్పోయిన దారుణ ఘటనపై బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన మానవత్వాన్ని మించిపోయిన క్రూరత్వమని ఆయన పేర్కొన్నారు. బీసీ రజకుల కుటుంబం గుడికి వెళ్లారన్న నెపంతో, రూ.100 ఇవ్వలేదనే కారణంగా భార్యాభర్తలను చిత్రహింసలకు గురిచేసి, చివరికి రెండు నెలల పసికందును కాలితో తన్ని ప్రాణాలు తీసిన ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఇబ్రహీం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం సహా కఠిన సెక్షన్ల కింద కేసు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని ఆయన కోరారు. బాధిత కుటుంబానికి కనీసం రూ.50 లక్షల పరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కులహింసలకు తావులేకుండా ప్రత్యేక వేగవంతమైన కోర్టు ద్వారా విచారణ జరిపి, నిందితుడికి అత్యంత కఠిన శిక్ష విధించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి పూర్తి భద్రత కల్పించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన తెలుపుతూ, బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత కూడా బహుజనులపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరం. సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం బీఎస్పీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుంది, అని ఇబ్రహీం పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు బహుజన సమాజ్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్, బీఎస్పీ సీనియర్ నాయకులు చిత్రం కృష్ణ, రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి ప్రహ్లాద్‌తో పాటు బీఎస్పీ జాతీయ నాయకులు, రాష్ట్ర కోఆర్డినేటర్లు, అన్ని జిల్లాల, నియోజకవర్గ, మండల, మున్సిపల్ స్థాయి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీఎం కప్ బాక్సింగ్ పోటీలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** సిఎం కప్ రాష్ట్ర బాక్సింగ్ పోటీలలో హైదరాబాదు జిల్లా నుండి ఆర్. కే. వర్షిణి 4446 వెయిట్ కేటగిరిలో గోల్డ్ మెడల్ కైవసం చేసు కున్నది. అమ్మాయి సికింద్రాబాదు లోని సెయింట్ ఫ్రాన్సెస్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తోంది. హిందుస్తాన్ బాక్సింగ్ క్లబ్ కోచ్లు భాస్కర్, సాగర, అశేష్, రాజేష్‌లు తమ విద్యార్థినిని అభినందించారు.

## సీఎం కప్ రాష్ట్ర యోగాసన పోటీల్లో జిల్లా ఘన విజయం

**ఐదు యోగా పతకాలు కైవసం**



**సికింద్రాబాద్,విశాలభారతి:** సరూర్ న గర్ స్టేడియం లో నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ యోగాసన రాష్ట్ర స్థాయి పోటీల్లో హైద్రాబాద్ జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చి 4 పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి నందనం కృపాకర్, హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.. శ్రీధర్ రావు కార్యదర్శి జయరాజ్ ఆర్య విజేతలను అభినందించారు.

## హయత్‌నగర్‌లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్‌నగర్ డివిజన్‌లో ఏళ్ల తరబడి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వరదనీటి సమస్యకు పరిష్కారం దిశగా కీలక నిర్ణయం తీసుకోబడింది. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కి గౌడ్ చొరవతో రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సౌభాగ్యనగర్ నుంచి ఇంజాపూర్ రోడ్డు వరకు లక్ష్మీ ప్రియకాలనీ మీదుగా వరదనీటి ట్రంక్ లైన్ నిర్మాణానికి ఈ నిధులు కేటాయించబడినట్లు తెలిపారు. వర్షాకాలంలో సాహెబ్‌నగర్ పరిసర కాలనీల నుంచి భారీగా వరదనీరు ఇంజాపూర్ రోడ్డుమీదుగా ప్రవహించి, హయత్‌నగర్ఇంజాపూర్ రోడ్డు కొట్టుకపోయి గుంతల మయంగా మారిన సందర్భాలు అనేకం. దాంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో మధుయాష్కి గౌడ్ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో చర్చలు జరిపి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే కాంట్రాక్టర్ భారీ పైపులను దిగుమతి చేసి పనులకు సిద్ధంగా ఉంచినట్లు సమాచారం. త్వరలోనే ట్రంక్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నగౌని రవీందర్ గౌడ్ తెలిపారు. హయత్‌నగర్ డివిజన్ ప్రజల తరపున డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్ మధుయాష్కి గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయిన తర్వాత హయత్‌నగర్ డివిజన్‌లో వరదనీటి సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుందని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌కు మంత్రివర్గ ఆమోదం

- 239 ఎకరాల కేటాయింపు
- సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పండ్ల రసాలతో అభిషేకం
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్మెట్ మండలం కోహెడ ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయిలో పండ్ల మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంతో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, వర్తకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌరవ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ సర్వే నంబర్ 167లో రాష్ట్ర ప్రభుత్వం 239 ఎకరాలను పండ్ల మార్కెట్ నిర్మాణానికి అధికారికంగా కేటాయించడం శుభపరిణామమన్నారు. రైతుల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం నిలిచిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రైతులు, వర్తకులు నష్టపోయారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , స్థానిక ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులకు పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాస్కర చారి, పాలకవర్గం సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి, దోమలపల్లి అంజయ్య, లక్ష్మి, బండి మధుసూదన్ రావు, గణేశ్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, నర్సింహా, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీంతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, రైతులు సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద స్కూల్ సాయిల్ హెల్త్ కార్యక్రమం

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలం చిల్కూర్ గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద స్కూల్ సాయిల్ హెల్త్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో మట్టి ఆరోగ్య ప్రాముఖ్యత, స్థిరమైన వ్యవసాయ విధానాలు, భూమి సంరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యాలలో భాగంగా వ్యవసాయ శాఖ మరియు పాఠశాల విద్యాశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీమతి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీ సునీల్ కుమార్, శ్రీ పండరి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీ ఎం. శౌరి రాజు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గారిని అవమానిస్తే సహించం

- దోషులు ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించక తప్పదు
- గిరిజన మహిళకు చైర్మన్ పదవి ఇవ్వడం అగ్రవర్ణాల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు
- భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారాలు చర్యలు తీసుకోవాలి
- భూక్య రవి నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి




**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ పట్టణంలో గిరిజన మహిళగా ప్రజల ఆశీస్సులతో ఎన్నికైన మున్సిపల్ చైర్మన్‌పై అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిని కేవలం రాజకీయ కక్షతో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని ఒకరిద్దరు వ్యక్తులు ఎన్నికల్లో ఓడించారనే నెపంతో ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన మహిళకు చైర్మన్ పదవి రావడం ఇతర పార్టీలకు అగ్రవర్ణాల నాయకులు కొందరు జీర్ణించుకోలేకపోవడం దురదృష్టకరం అని విమర్శించారు. ఇది వ్యక్తిగత దాడి మాత్రమే కాకుండా గిరిజన సమాజ మహిళ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నమని అన్నారు. ఇలాంటి అవమానకర ఘటనలకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని భూక్య రవి నాయక్ డిమాండ్ చేశారు. లేకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## అకాల వర్షంతో మహబూబాబాద్ రైతులకు భారీ నష్టం

- కళ్లం మీద మిర్చి నాశనం, గాలివానకు కూలిన మొక్కజొన్న
- పంట నష్టం అంచనా వేసి తక్షణ పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి



**మహబూబాబాద్, విశాలభారతి:**

సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం మహబూబాబాద్ జిల్లా రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా పరిధిలోని బయ్యారం మండలం, కురవి మండలం ప్రాంతాల్లో పంటలు నేలమట్టమయ్యాయి. కళ్లం మీద ఎండబెట్టిన మిర్చి పంట తడిసి ముద్దవగా, పొలాల్లో నిలువుగా ఉన్న మొక్కజొన్న పంటలు గాలివానకు కూలిపోయాయి. వివరాల్లోకి వెళితే, బయ్యారం మండలంలోని కార్ కొండ పల్లి గూడెం రెడ్డి తండాలో పంటలు నష్టం అయిపోయాయి. అలాగే కురవి మండలంలోని బంచరాయితండ గ్రామంలో "ఎర్ర బంగారం"గా పేరుగాంచిన మిర్చి పంట పూర్తిగా తడిసిపోవడంతో రైతులు హరిగోశలు పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించి, అప్పులు తెచ్చి సాగు చేసిన పంట క్షణాల్లో నాశనమవ్వడంతో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. మాజీ సర్పంచ్ పూన్నం మాట్లాడుతూ, "పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి ఇలా దెబ్బతీసింది. కళ్లం మీద ఉన్న మిర్చి మొత్తం తడిసిపోయింది. మళ్లీ ఎండబెట్టే పరిస్థితి లేదు. మార్కెట్ ధరలు పడిపోతాయనే భయం ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న రైతులు కూడా తీవ్ర నిరాశలో ఉన్నారు. వర్షపు గాలికి మొక్కలు నేలకూలిపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు ఈ అకాల వర్షం మరింత భారంగా మారింది. రైతులు ప్రభుత్వాన్ని వెంటనే స్పందించాలని, నష్టాన్ని అంచనా వేసి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని నమోదు చేయాలని కోరుతున్నారు. అకాల వర్షం కారణంగా ఎర్ర బంగారం తడిసి ముద్దవడంతో జిల్లా వ్యాప్తంగా రైతన్నల ముఖాల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని రైతులకు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.

## చైర్మన్ పావని రమేష్ గౌడ్‌ని పరామర్శించిన ఏసీపి,సీఐ

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని మున్సిపల్ చైపర్సన్ పావని గౌడ్ మామ మొగుదాల స్వామి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయాన్ని తెలుసుకున్న ఏసిపి మధుసూదన్ రెడ్డి మరియు సిఐ చౌటుప్పల్ మన్మధ కుమార్ వారిని పరామర్శించి, వారి కుటుంబానికి మనోధైర్యాన్నిగా ఉండాలని తెలిపారు. మొగుదాల స్వామి గౌడ్ ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నానని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, పల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఆరంఘర్ వద్ద హైటెన్షన్ డ్రామా



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ పరిధిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ ప్రైవేట్ ట్రక్‌లో గోవులను తరలిస్తుండగా గౌరక్షక్ సభ్యులు అడ్డగించి పట్టుకున్నారు. శివరాంపల్లి ప్రాంతంలో ట్రక్‌ను గుర్తించిన గౌరక్షక్ దళ్ సభ్యులు వాహనాన్ని వెంబడించారు. వారిని తప్పించుకుని వెళ్లే ప్రయత్నంలో ట్రక్ డ్రైవర్ ఎదురుగా వచ్చిన ఓ క్యాబ్ వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. దీంతో ఆరంఘర్ చౌరస్తా వద్ద భారీగా జన సమూహం చేరి ఉద్రిక్తత నెలకొంది. వాహనాన్ని ఆపి పట్టుకున్న గౌరక్షక్ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జనసమూహాన్ని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. రంజాన్ మాసం నేపథ్యంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిస్థితి అదుపులో ఉందని పోలీసులు తెలిపారు.

## ప్రపంచ రికార్డు సాధించిన హైదరాబాద్ బాలిక

**తైక్వాండోలో నాగ సాయి అరుషి కు విశేష గుర్తింపు**




**హైదరాబాద్, విశాలభారతి:** హైదరాబాద్‌కు చెందిన యువ తైక్వాండో క్రీడాకారిణి నాగ సాయి అరుషి ప్రపంచ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. తైక్వాండో చాంపియన్‌షిప్‌లలో అత్యల్ప వయస్సులో అత్యధిక టైటిళ్లు గెలుచుకున్న క్రీడాకారిణిగా ప్రపంచ రికార్డు నెలకొల్పి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచింది. 2022 సంవత్సరం నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వరుస విజయాలు నమోదు చేస్తూ అనేక స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంది. నేపాల్ రాజధాని కాఠ్మాండులో నిర్వహించిన 4వ మౌంట్ ఎవరెస్ట్ తైక్వాండో అంతర్జాతీయ చాంపియన్‌షిప్ లో జూనియర్ గర్ల్స్ అండర్59 కిలోల విభాగంలో రజత పతకం సాధించి ప్రతిభ చాటింది. అదేవిధంగా, 202425 విద్యా సంవత్సరానికి సంబంధించిన 68వ నేషనల్ స్కూల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కూడా రజత పతకం సాధించింది. ఆమె నిరంతర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావాన్ని తెలంగాణ యూత్ తైక్వాండో సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. యువ వయస్సులోనే విశిష్ట విజయాలు సాధిస్తున్న నాగ సాయి అరుషి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ఘనతలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడినట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. మల్కాజ్ గిరి సిటీ కమిషనరేట్ పరిధిలోని నాగోల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో, త్యాగరాయ నగర్ కాలనీకి చెందిన కమ్మరి సాయి కుమార్ (26)పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఇన్స్పెక్టర్ వివరించారు. మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించినట్లు ఫిర్యాదు అందిన వెంటనే సాక్ష్యాధారాలు సేకరించి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు పూర్తి ఆధారాలను పరిశీలించి నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.10 వేల జరిమానా విధించిందని చెప్పారు. అదనంగా బాధితురాలికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు. పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల్లో పోలీసులు ఎలాంటి రాజీ పడబోరని, కఠిన చర్యలు కొనసాగుతాయని నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ స్పష్టం చేశారు.

## బూట్లు నాకే సంస్కృతి నీది



**విశాలభారతి:** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లక్ష్యంగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రేవంత్ రెడ్డి బూట్లు నాకుతూ రాజకీయ పబ్బం గడుపుకునే చామల కిరణ్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను విమర్శించే స్థాయి లేదని మండిపడ్డారు. కేవలం పేపర్ స్టేట్‌మెంట్లు ఇవ్వడం, టీవీ చర్చల్లో కనిపించడం తప్ప భువనగిరి నియోజకవర్గ ప్రజల కోసం ఆయన చేసిన అభివృద్ధి ఏమీ లేదని ధ్వజమెత్తారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే బండి సంజయ్ వంటి నాయకుడిని విమర్శించి పెద్ద లీడర్ కావాలనుకోవడం చామల భ్రమ అని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో రూ. 12 లక్షల కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిన విషయాన్ని ఎంపీ మర్చిపోయారా అని కుమార్ నిలదీశారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి ఎన్ని నిధులు తీసుకువచ్చారో తమ వద్ద లెక్కా పత్రాలతో సహా పక్కా ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రంపై అనవసర నిందలు వేయడం మానుకొని, అధికారంలో ఉన్న మీ కాంగ్రెస్ ప్రభుత్వం నుండి భువనగిరి నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎన్ని నిధులు తీసుకువచ్చారో సమాధానం చెప్పే దమ్ముందా అని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత నియోజకవర్గంలో పర్యటించి ప్రజల కష్టాలు తెలుసుకోవడం చేతగాని ఎంపీ, కేవలం రాజకీయ ఉనికి కోసం బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని, ఎంపీ కిరణ్ తన నియోజకవర్గానికి తెచ్చిన నిధులపై బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అనవసరమైన విమర్శలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. భువనగిరి ప్రజలు ఎంపీ తీరును గమనిస్తున్నారని, వచ్చే రోజుల్లో ఆయనకు రాజకీయంగా పుట్టగతులు ఉండవని కుమార్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# సీఎం కప్ విజేతలను అభినందించిన జిల్లా కలెక్టర్

**పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవి రామిరెడ్డి**



**భద్రాచలం, విశాలభారతి:** సీఎం కప్ స్టేట్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గెలుపొందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణిలను జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మొత్తం 54 పతకాలు సాధించగా, అందులో 15 బంగారు పతకాలు, 19, రజత పతకాలు, 20 కాంస్య పతకాలు వచ్చినట్లు తెలిపారు. ఇదేవిధంగా క్రీడాకారులు ఇంకా ఎన్నో పతకాలను తీసుకువచ్చి మన జిల్లాకు,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, జిల్లా కలెక్టర్ కి మరియు స్పోర్ట్స్ ఆఫీస్ పరంధామ రెడ్డి కి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ జివి రామిరెడ్డి, కోచ్ కావేటి రమేష్, సీనియర్ అసిస్టెంట్ తిరుమల రావు, మరియు జిల్లా క్రీడాకారిణులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళ న్యాయవాదుల సదస్సుకు తరలి రండి

**సీనియర్ న్యాయవాది అవులూరి సత్యనారాయణ పిలుపు**



**భద్రాచలం, విశాలభారతి:** హైదరాబాద్ లో ఈనెల . 28.2.2026న జరిగే ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ పి ఎల్ ఎ) ఆధ్వర్యంలో జరిగే మహిళా న్యాయవాద సదస్సుకు తరలి రావాలని తెలంగాణా రాష్ట్ర ఐ పి ఎల్ ఏ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అవులూరి సత్యనారాయణ. పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ మహిళా మహాసభ కు మహిళా న్యాయవాదులు అత్యధికముగా కదిలివెళ్లాలని మహిళా న్యాయవాదుల యొక్క సమస్య లు, కొత్త చట్టాల పై అవగాహన కల్పించడం, ప్లీడింగ్ ప్రాక్టీస్ పై అవగహన తదితర చట్టాల సులువైన మార్గాల పై సీనియర్ న్యాయవాదులు తో తరగతులు నిర్వహించడం జరుగుతుందనీ ఆయన తెలిపారు. కావున మహిళా న్యాయవాదులు తరలి రావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మామిడి పుల్లారావు కి ఘన సన్మానం

- **ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సన్మానం**
- **అభినందనలు తెలిపిన పలువురు కాంగ్రెస్ నాయకులు**



**భద్రాచలం, విశాలభారతి:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి భద్రాచలం వేదిక సాగిన నేపథ్యంలో నీళ్లు నిధులు నియామకాలు ఈ ప్రాంత ప్రజలకు చెందాలని ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం భద్రాచలంలో తనదైన శైలిలో విద్యార్థి ఉద్యమ నేత మామిడి పుల్లారావు క్రియాశీలక పాత్ర మరువలేనిదని భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ దొర పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నిక కాబడ్డ మామిడి పుల్లారావుకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాలువాతో కాంగ్రెస్ శ్రేణులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ దొర మాట్లాడుతూ ఆ ఉద్యమాన్ని గుర్తుపెట్టుకొని ఉద్యమకారుల సంక్షేమ సంఘం మామిడి పుల్లారావు కి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను గుర్తించి పదవి ఇవ్వడం శుభ పరిణామం అని ఆయన అన్నారు. ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపుగా పదవులు ఇవ్వటం అనేది వారి ఉద్యమస్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు. తెలంగాణ ప్రాంతం ఈనాడు కాంగ్రెస్ హయాంలో ఆనాటి తెలంగాణ ఏర్పాటు వాదుల కలలను సార్థకం చేస్తుందని ఆయన వివరించారు. ఆనాటి ఉద్యమానికి విద్యార్థి ఉద్యమ నాయకుడిగా తనదైన పాత్ర నిర్వహించి భద్రాచలం ప్రాంతంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని మామిడి పుల్లారావుకు మరొకసారి అభినందనలు తెలుపుతున్నానని ఆయన అన్నారు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జరిగిన సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి పి సి సి సభ్యులు బుడగం శ్రీనివాస్ , రత్నం రమాకాంత్, చింతిర్యాల రవికుమార్, భీమవరపు వెంకటరెడ్డి, సరెళ నరేష్, నర్రా రాము, యూత్ కాంగ్రెస్ గాడి విజయ్, పెద్దినేని శ్రీనివాస్, దుద్దుకూరు సాయిబాబు, జిందా, కారం దుర్గారావు, నిట్ట రాజు, తాటి ఉదయ్, చాట్ల రవికుమార్, చింతాడి రామకృష్ణ, పుల్లగిరి నాగేంద్ర , భాచినేని భాను భారత్ మార్ తదితరులు అభినందనలు తెలిపారు

# కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటన



**బోడుప్పల్, విశాలభారతి:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి బోడుప్పల్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటి చెత్త సేకరణ నిర్వహణ, స్వచ్ఛ ఆటో వాహనాల ద్వారా చెత్త సేకరణ విధానం వాటి అవసరాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ . డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( ఎస్. డబ్లు. ఎమ్ ) జాహ్నవి శశాంక్ ను కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో చెత్త సేకరణ ప్రక్రియ సక్రమంగా జరుగుతోందా, ఎక్కడైనా లోపాలు ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రహదారుల రెండు వైపులా పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించాలని అధికారులకు సూచించారు. అలాగే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ లను సమర్థవంతంగా తొలగించి, అక్కడ మళ్లీ చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా, స్వచ్ఛ ఆటో వాహనాల సంఖ్యను పెంచి ఇంటింటి చెత్త సేకరణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా, స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో పరిశుభ్రతను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఇట్టి పర్యటన లో ఎ. ఇ (ఎస్. డబ్లు. ఎమ్ ) మహేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# అశ్వారావుపేట అభివృద్ధి హామీల అమలు దిశగా అడుగులు

- **దొంతుకుంట చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం**
- **పట్టణ సౌందర్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి**
- **ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా మున్సిపాలిటీ కార్యాచరణ**



**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. పట్టణ సౌందర్యాన్ని పెంచడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోద వేదికగా మార్చే లక్ష్యంతో దొంతుకుంట చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరంగా పని చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరియు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సహకారంతోనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. వారి మార్గదర్శకత్వం, సహకారం వల్ల పట్టణానికి అవసరమైన నిధులు సమకూరుతున్నాయని వెల్లడించారు. దొంతుకుంట చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు చుట్టూ శుభ్రత పనులు, పాదచారుల మార్గాలు, కూర్చునే బెంచీలు, లైటింగ్ సదుపాయాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు లభించడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదానికి అనువైన ప్రదేశంగా చెరువు మారనుంది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ అశ్వారావుపేటను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పనిచేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు.

# ఇంటర్, 10వ తరగతి పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

- **విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలి**
- **సీఎస్ రామకృష్ణారావు**



**మహబూబాబాద్, విశాలభారతి:**

రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ మరియు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డా బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి కార్యదర్శిడా యోగితా రాణా, కృష్ణ ఆదిత్య, నికోలస్ తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, పీఎం శ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ తదితర అంశాలపై సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, వైద్య సదుపాయాలు, సీసీ కెమెరాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడానికి అనుమతి లేదని, పకడ్బందీ తనిఖీ అనంతరం విద్యార్థులను కేంద్రాల్లో కి అనుమతించాలని స్పష్టం చేశారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సానుకూల వాతావరణం కల్పించాలన్నారు. ప్రత్యేకించి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అలాగే పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సమగ్ర శిక్షా అభియాన్ అమలు పురోగతిని సమీక్షిస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు కృషి చేయాలని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహణకు 18 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 4158 మంది, 2వ సంవత్సరం లో 4129 మంది, మొత్తం (8287) మంది విద్యార్థులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని విద్యార్థులు నిర్ణీత సమయం కంటే. ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10 తరగతి పరీక్షలకు 45 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 8157 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ)అనిల్ కుమార్, విజయలక్ష్మీ, డీఈఓ రాజేశ్వర్, ఇంటర్మీడియట్ అధికారి మదర్, జిల్లా వైద్యాధికారి డా రవి రాథోడ్, ఆర్టిఓ క్రిష్ణ వేణి, ఆర్టీసీ డిఎం పాల్గొన్నారు.

# రామగుండం కార్పొరేషన్‌లో రీ పోలింగ్ జరిపించాలి

- **ఎన్నికల్లో అవకతవకలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
- **చర్యలు తీసుకోకుంటే ఈసీకి ఫిర్యాదు చేస్తాం**
- **రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరు కంటి చందర్.**



**విశాలభారతి, గోదావరిఖని :**

ఇటీవల రామగుండంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే మక్కాన్సింగ్ అవినీతి ఆరోపణలకు పాల్పడి 43 డివిజన్ లలో బి ఆర్ఎస్ నాయకులను బెదిరించి కాంగ్రెస్ నాయకులను గెలిపించుకున్నాడని మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ఆరోపించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు రామగుండం కార్పొరేషన్ ఎన్నికలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 43 డివిజన్ లలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు యదేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, స్ట్రాంగ్ రూమ్ వద్ద కరెంటు కరెంటు తీసివేసిన సమయంలో ఓట్ల మార్పిడికి పాల్పడ్డారని ఆరోపించారు. బ్యాలెట్స్ బాక్స్ ఓపెన్ చేస్తే దాదాపు ఓట్లు అన్ని ఓట్లు కాంగ్రెస్కే పడ్డాయని, కానీ డివిజన్లో వారీగా ప్రజలు తాము బి ఆర్ఎస్ కే ఓటు వేశామని తెలిపారని, దీన్నిబట్టి ఎమ్మెల్యే తన పదవీ బలంతో బ్యాలెట్ బాక్స్ లు తారుమారు చేశారని, తమకు ఈ విషయమై అనుమానం ఉందని, ఈ విషయంపై అధికార పార్టీకి తొత్తులుగా పనిచేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోకపోతే త్వరలోనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 43 డివిజన్ లలో రీ పోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# జీఎస్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఆడబిడ్డకు అండగా ఉంటా

**మాజీ కౌన్సిలర్, జీఎస్ సేవా సమితి చైర్మన్ గ్యారల శ్రీనివాస్ గౌడ్**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** జిహెచ్ఎంసి నాగోల్ సర్కిల్ కుంట్లూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న పామోజు బ్రహ్మచారి-సౌభాగ్య దంపతుల పెద్ద కుమార్తె వివాహానికి జీఎస్ సేవా సమితి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్, జిఎస్ సేవా సమితి చైర్మన్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ రూ.10,000ల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డ పెళ్లి ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన, కానీ ఆర్థికంగా భారమైన సందర్భమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇలాంటి వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అలాంటి కుటుంబాలకు జీఎస్ సేవా సమితి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. జీఎస్ సేవా సమితి ద్వారా అవసరం ఉన్న ప్రతి ఆడబిడ్డకు అన్నలాగా అండగా ఉంటాను. ఎవరికైనా సహాయం అవసరమైతే సంకోచం లేకుండా మా సేవా సమితిని సంప్రదించాలి. ఒక ఆడబిడ్డ వివాహం ఆనందంగా, గౌరవంగా జరగడం సమాజం మొత్తం బాధ్యత అని ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాలు కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో ఉండాలని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సహాయ కార్యక్రమాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు విద్య, వైద్యం, వివాహాల వంటి అవసరాల్లో జీఎస్ సేవా సమితి సహకారం కొనసాగుతుందని వెల్లడించారు. స్థానిక ప్రజలు గ్యారాల శ్రీనివాస్ గౌడ్ సేవా భావాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**కరెంట్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజల డిమాండ్**

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నివాస ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరియు అస్తవ్యస్తంగా వేలాడుతున్న తీగలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బహిరంగంగా కనిపిస్తున్న విద్యుత్ వైర్లు, సరిగా అమర్చని కనెక్షన్లు ప్రమాదానికి దారితీయొచ్చని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇళ్ల సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం, తీగలు కిందకు వాలిపోవడం వల్ల చిన్నారులు, పాదచారులకు ప్రాణహాని ముప్పు ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగే ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని, అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# యూరియా యాప్ రద్దు చేయాలి

**టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పార్టీ నాయకులు, ప్రభుత్వాలు రైతుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని కోరారు. యూరియా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం, వినియోగించడం రైతులకు అర్థం కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా కౌలు రైతులు, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతులే రాజ్యం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం రైతులను మోసం చేస్తూ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని, యూరియా అందుబాటులో లేక రైతు కుటుంబాలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరోనా వంటి కష్టకాలంలో కూడా రైతుబంధు నిలిపివేయలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా యూరియా యాప్‌ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాప్ విధానం వల్ల రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్, మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అప్రోచ్, మండల నాయకులు కీసరి రాంరెడ్డి, కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేశం, మారయ్య రాజు, పలుసం రమేష్, ఒంగల బిక్షపతి, ముద్దసాని కిరణ్, బొడిగె లింగస్వామి, గంధమల్ల బ్రహ్మయ్య, మద్దెల మంజుల, చేగూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి గ్రామం నుండి టీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేశారు. ధర్నా స్థలానికి ఎస్సై యుగంధర్, ఎమ్మార్వో దశరథ్ చేరుకొని నాయకులతో మాట్లాడి సమస్యను పై అధికారులకు వివరిస్తామని హామీ ఇచ్చి ధర్నాను సడలింపజేశారు.

# ఇందిరమ్మ ఇండ్లకు నోచుకోక పేదోళ్లు గుడిసెల్లోనే

- **కలిగినోడు చెంతకి ఇందిరమ్మ గూడు**
- **అర్హులకు దక్కని సర్కారీ ఇండ్లు**
- **శిథిలావస్థకు చేరిన పూరిళ్లు పీక్కొని కిరాయిలకు**
- **ఈ పాపం ఎవరిది అంటున్న పేదోళ్లు**



**అశ్వాపురం, విశాల భారతి :**

వడ్డించేవాడు మనోడైతే చివరి బంతిలో కూర్చున్న పుష్టిగా భోంచేయొచ్చని అన్నారు పెద్దలు. ఇప్పుడు ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికల పరిస్థితి కూడా అలాగే తయారైందని పలువురు గుసగుసలాడుతున్నారు. మనసులో పట్టలేనంత ఆగ్రా వేషాలు ఉన్నా బయటపడితే ఏమవుతుందోనన్న సంకట స్థితిలో ఉన్నారు మండలానికి చెందిన ప్రజలు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలలో నిరుపేద ప్రజలకు తీవ్ర అన్యాయమే జరిగిందని పలువురు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు 400 సదరపు గజాలలో ప్రభుత్వమే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిచ్చేందుకు పూనుకుంది. ఆ ఇంటి నిర్మాణం ఎలా ఉంటుందో కూడా మండల కేంద్రాలలో నమూనా ఇండ్ల నిర్మాణాలను ప్రజా ప్రదర్శనల కోసం చేపట్టారు. కానీ తీరా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ పంచాయితీలలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీల వారు ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లను కట్టబెట్టారు. దీంతో ఆ కమిటీలలో ఉన్న కొందరు వారికి అనుకూలమైన కొంత బందు ప్రీతి కలిగిన వారిని ఎంపిక చేసి ఇండ్లను కట్టబెట్టారు. ఈ ఎంపికలు చేస్తున్న సందర్భంలో దారిద్రరేఖకు అత్యంత దిగువన ఉన్న వారిని ఎంపిక చేసి సొంతింటి కల నెరవేర్చే ప్రభుత్వ లక్ష్యాన్నీ నూటికి నూరుపాళ్లు సహకారం చేయాల్సిన బాధ్యత ఉన్నవారు ఆ లక్ష్యాన్ని గాలికి వదిలి అర్హులను అందం ఎక్కించారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.





**అసలైన పేదోడే ఇల్లు కట్టలేని స్థితిలో ఉన్నాడు :**

మండలంలో ఇప్పటివరకు మొత్తం ఇందిరమ్మండ్లు 817 మంజూరయ్యాయి. అందులో 64 ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారులు ఇంతవరకు ముగ్గు కూడా పోసుకోలేకపోయారు. ఓ 6 ఇండ్లు ఇప్పటివరకు పూర్తవగా, మిగిలిన ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ మార్చి లోపు మొదలుపెట్టని వారు కనీసం బేస్మెంట్ అయినా పూర్తి చేసుకోకపోతే ఇక ఆ ఇండ్ల పరిస్థితి ఏం జరుగుతుందో చెప్పలేమని అధికారులు అంటున్నారు. ఇదిలా ఉండగా 64 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో ఇండ్లు నిర్మాణం చేపట్టకపోవడంతో పాటు కనీసం కొందరు లబ్ధిదారులు బేస్మెంట్ కూడా కట్టే పరిస్థితిల్లో లేరనే వాదనలు వినిపిస్తున్నాయి.

**అవి ఇందిరమ్మ నిర్మాణాలు కాదు కలిగినోళ్ల భవంతులు అంటున్న ప్రజలు :**

ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పేదవాడికి సొంత ఇంటి కల సహకారం చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. లక్ష్యాన్ని అయితే పెట్టుకుంది గాని ఎంపికల విషయంలో కాస్త నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలు పేదవాడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం ముందు పెట్టుబడులు పెట్టి నిర్మాణం చేసుకునే స్తోమత ఉన్నవారు ఉన్నారా...? లేరా..? అని అంచనాలు వేయడంలో విఫలమైందని ప్రజలంటున్నారు. 400 అడుగుల ఇంటి నిర్మాణాన్ని చేపట్టలేని వారు సుమారు 600 అడుగుల చదరపు అడుగుల వైశాల్యంతో ఎలా ఇంటిని నిర్మాణం చేపట్టుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అలా ఇండ్లను నిర్మాణం చేపట్టుకునే వాళ్ళందరూ ఎంతో కొంత ఆర్థిక స్తోమత కలిగిన వారేనని అలా ఎసులుబాటు ఇవ్వడంతో ఇందిరమ్మ నమూనా ఇండ్లను మండలంలో ఎవరైనా కడుతున్నారా ప్రభుత్వ అధికారులు చెప్పాలని ప్రజలు అంటున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యానికి కొందరు స్థానిక నాయకులు, కమిటీల వారు ఇష్టానుసారంగా ఎంపికలు చేపట్టి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచారని విమర్శలు వినవస్తున్నాయి. ఉదాహరణకు మండల కేంద్రంలోని మల్లమ్మ సెంటర్ సమీపంలో లబ్ధిదారుడికి కమిటీ సభ్యులు ఇందిరమ్మ ఇంటికి ఎంపిక చేశారు. మరి ఆ వ్యక్తి నిర్మాణం చేపట్టిన ఇంటి వ్యాయం చెప్పుకోవడానికే భయంకరంగా ఉందని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఇక ఆ ఇంటి నిర్మాణంలోని అంగు ఆర్భాటాలు అంతా ఇంత కాదని స్వచ్ఛందంగా అటువంటి ఇల్లు నిర్మాణం చేపట్టుకుంటే సుమారు రూ. 15 లక్షల పై చీలికే అవుతుందని ప్రజలు అంటున్నారు. అంతేకాకుండా కాస్తో కూస్తో భూమి బుట్రా ఉన్నవారికి, విలేకరులకు, నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారికి ఇలా అనేక మందికి ఇందిరమ్మ ఇచ్చి అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేశారో లేదో ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిన వారు, ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన రోజు వస్తుందని మండల ప్రజలు గంటపదంగా అంటున్నారు.

# కనుమరుగవుతున్న మావోయిస్టులు

**విశాలభారతి , భద్రాద్రి కొత్తగూడెం:**

డిస్ట్రిక్ట్ కరకగూడెం మండల దేశవ్యాప్తంగా మావోయిస్టులు కనుమరుగు కాబోతున్నారా? పూర్తిగా తుడిచిపెట్టుకుపోతారా? వారి ఉనికి ప్రశ్నార్థకం అయిపోయిందా? మన దేశంలోని మావోయిస్టులు ఇక చరిత్రలోనే మిగిలిపోతారా? అంటే జరుగుతున్న పరిణామాలు బట్టి చూస్తే అవుననే అనిపిస్తోంది. ఆపరేషన్ కగార్ అనంతరం మావోయిస్టులు తమ ప్రాబల్యం పూర్తిగా కోల్పోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కరకగూడెం మండలం ఒకప్పుడు కరడుగట్టిన మావోయిస్టు ప్రాంతం. ఇక్కడ దట్టమైన అడవి ఉండడం వల్ల అన్నలు ఈ ప్రాంతంలో కార్యకలాపాలు కొనసాగించారు. సమీపంలో ఉన్న పగిడేరులో కూడా పీపుల్స్ వార్ కార్యకలాపాలు విస్తృతంగా ఉండేవి. ఏజెన్సీ ప్రాంతం కావడం వల్ల ప్రజల్లో కూడా సానుభూతి పరులు ఉండేవారు. ఒకప్పుడు సమాంతర ప్రభుత్వాన్ని తలపించే రీతిలో మావోయిస్టులు పోలీసులకు సవాలు విసిరారు. ఈ క్రమంలో 1992 సెప్టెంబర్ 4న పినపాక, కరకగూడెం మధ్య గల రాళ్ళ వాగు వద్ద మావోయిస్టులు బ్రిడ్జిని పేల్చి వేశారు. ఈ భారీ విస్ఫోటనానికి ఐదు మందు పాత్రలు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టు కదలికలను అరికట్టడానికి కరకగూడెంలో ఒక నూతన పోలీస్ స్టేషన్ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1997 జనవరి 9న కరకగూడెం పోలీస్ స్టేషన్ను కూడా మావోయిస్టులు పేల్చేశారు. క్రమంగా సింగరేణి బొగ్గు గనులు ఏర్పాటు కావడంతో స్థానికులకు ప్రత్యక్షంగా,పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరికాయి. మరో పక్క ప్రభుత్వం కూడా ఉక్కు పాదంతో నక్సల్స్ కార్యకలాపాలను అణచి వేసింది. ప్రభుత్వం స్కూల్స్, హాస్పిటల్స్, రోడ్లు ,విద్యుత్ వంటి అవస్థాపన సౌకర్యాలు కల్పించడం జరిగింది. ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనీ కరకగూడెం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి.



**కర్రెగుట్టల్లో ఏరివేతే లక్ష్యం**

కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ - 1 ప్రభావం వలన ఛత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టుల ప్రభావం తగ్గుముఖం పట్టింది. ఈ భారీ ఆపరేషన్ 2024 జనవరిలో ప్రారంభమైంది. దీంతో ఇదే సంవత్సరం ఏప్రిల్‌లో కంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుమారు 29 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2025 ఏప్రిల్ 21 నుంచి ఆపరేషన్ కగార్ తీవ్రత పెరిగింది. ఫలితంగా 150 మందికి పైగా మావోయిస్టులు చనిపోయినట్లు వివిధ నివేదికలు చెప్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చడమే ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా కొత్తగూడెం జిల్లాలోనే దాదాపు 300 మంది దళసభ్యులు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ముందు లొంగిపోయారు. 2025 నవంబర్‌లో అగ్రనేత హిడ్మా అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయాడు.

**ఆపరేషన్ కగార్‌తో కకావికలం**

2026 ఫిబ్రవరి 17 ఆపరేషన్ కగార్ 2 అధికారికంగా ప్రారంభమైంది. ఈ ఆపరేషన్ ముఖ్యంగా తెలంగాణ ఛత్తీస్గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల అడవులను లక్ష్యంగా చేసుకొనే మొదలైంది. సుమారు 2000 మందికి పైగా సీఆర్పీఎఫ్,కోబ్రా, గ్రేహౌండ్స్, డీజీఎఫ్ బలగాలు కూంబింగ్ లో పాల్గొంటున్నాయి. మార్చి 2026 నాటికి నక్సలిజం రహిత భారత్ అనే లక్ష్యంలో భాగంగా రెండో విడత ఆపరేషన్ నడుస్తోంది. మావోయిస్టు అగ్ర నేతలు దేవ్ జీ,దామోదర్ వంటి వారు లక్ష్యంగా అడవులను జల్లెడ పడుతున్నారు.ఈ నేపథ్యంలో నే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ(తిప్పిరి తిరుపతి), రాజిరెడ్డి తో పాటు 16 మంది నక్సలైట్లు ఆసిఫాబాద్‌లో తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్టు తెలుస్తోంది. నంబాల కేశవరావు తర్వాత మావోయిస్టు పార్టీకి దేవ్ జీ నాయకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం కేంద్ర మావోయిస్టు పార్టీ సెక్రటరీ గా ఉన్న దేవ్ జీ లొంగిపోవడం అంటే పార్టీ వెన్నెముక విరిగినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక మిగిలింది గణపతి, పాపారావు, సాంబయ్య, శుక్రూ, నారాయణతోపాటు మరో వందలోపే ఉండొచ్చని సమాచారం.

**ఆరు రాష్ట్రాల పోలీసుల ఆపరేషన్**

ఆరు రాష్ట్రాల పోలీసులు కంకణం కట్టుకొని ఆపరేషన్ కగార్ 2 ను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నే సోమవారం మావోయిస్టులు నిర్మించుకున్న రహస్య బంకర్లను బలగాలు ధ్వంసం చేశారు. అలాగే నక్సల్స్ అమర్చిన మందు పాత్రలను బాంబు స్వాడ్ డిస్పోజ్ చేయడం జరిగింది. డ్రోన్ల సాయంతో అన్నల కదలికను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సరిహద్దు దాటకుండా భద్రతా బలగాలు అన్నీ సమన్వయం చేసుకుంటున్నట్లు కూడా తెలుస్తోంది. జల్లే, తడపాల, డోలీ అటవీ ప్రాంతాల్లో బలగాలు అణువణువు శోధిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం జరిగిన ఎన్కౌంటర్ లో ఐదుగురు మావోయిస్టులు మరణించగా ఆదివారం అగ్ర నేతలతో పాటు 14 మంది లొంగిపోయారు. మిగిలి ఉన్న ఆ కొద్ది మంది కూడా చిక్కితే మావోయిస్టు సాయుధ పోరాటానికి ఎండ్ కార్డు పడటమే కాకుండా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిజ్ఞ కూడా నెరవేరుతుందని భద్రత వర్గాలు భావిస్తున్నాయి.

**పార్టీ తుడిచిపెట్టుకుపోయినట్టేనా?**

దేశంలో ప్రధానంగా నక్సల్ ప్రభావిత రాష్ట్రాలు ఉన్నాయి. (మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, ఛత్తీస్ గఢ్, ఒడిశా, జార్ఖండ్,)వీటిలో తెలంగాణ పోలిస్శాఖ ఆపరేషన్ చేయూత ద్వారా లొంగుబాటులను విపరీతంగా ప్రోత్సహించిందని చెప్పొచ్చు. లొంగిపోయిన వారికి క్యాడర్లను బట్టి లక్ష నుంచి నాలుగు లక్షలు నగదు ప్రోత్సాహకం అందిస్తోంది. ఫలితంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వందల సంఖ్యలో మావోయిస్టులు కొత్తగూడెం ఎస్పీ ముందు లొంగిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ వారంలో కూడా తాటి మూక అలియాస్ చూటీ అనే బీజాపూర్ ఏరియా కమిటీ సభ్యుడు లొంగిపోయాడు. అతనికి అప్పటికపుడు 25వేలు నగదు ప్రోత్సాహకం కూడా అందజేశారు. ఒక్క సంవత్సరంలోనే 359 మంది మావోయిస్టులు కొత్తగూడెం ఎస్పీ ముందు లొంగిపోయారంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆపరేషన్ చేయూత పథకానికి నక్సల్స్ ఎంతగా ఆకర్షితులయ్యారో అర్థం చేసుకోవచ్చు. అలాగే పోలీస్ శాఖ అనేక అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టి ఆదివాసీలు మావోయిస్టుల పట్ల ఆకర్షితులవ్వకుండా ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. మొత్తంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కరకగూడెంలో అన్నలు కనుమరుగు అయినట్లే, కర్రెగుట్టల్లో కూడా కను మరుగు అవుతున్నారనే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. కానీ దశాబ్దాలుగా ఒక క్రమశిక్షణ కలిగిన పునాదుల మీద నిర్మించిన మావోయిస్టు పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకొని పోతుందా? లేదా తన వ్యూహాన్ని మార్చుకొని ప్రజల కోసం పోరాడుతోందా? వేచి చూడాల్సిందే.

## అశ్వారావుపేట మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



- రూ.3.63 కోట్ల విలువైన పనుల ప్రారంభానికి ఎమ్మెల్యే పర్యటన
- మండలం వ్యాప్తంగా సీసీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రాల ప్రారంభాలు
- ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు... పేదల కల సాకారం
- మహిళా సాధికారతకు ఎస్‌హెచ్‌జీ భవనాల శంకుస్థాపనలు

**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట మండలంలో అభివృద్ధి జోరు కొనసాగుతోంది. మొత్తం రూ.3 కోట్ల 63 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శ్రీకారం చుట్టారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపనలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగాయి. స్వంత ఇల్లు అనే పేదల కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచే ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాలు) భవనాల శంకుస్థాపనలు కూడా ఈ పర్యటనలో భాగంగా నిర్వహించారు. ఈ భవనాల ద్వారా మహిళా సంఘాలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పర్యటనతో అశ్వారావుపేట మండలంలో అభివృద్ధి పనులకు మరింత వేగం పెరుగుతుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**విశాలభారతి , కరకగూడెం:** మండలం బట్టుపల్లి రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహ సమయంలో ఎదురయ్యే ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారాయని తెలిపారు. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలు గౌరవప్రదంగా వివాహాలు నిర్వహించుకోగలుగుతున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి, పేదల సంక్షేమం మరియు మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 26 మంది లబ్ధిదారులకు రూ.26,03,016 విలువైన కళ్యాణ లక్ష్మి, లబ్ధిదారులకు షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మరియు (సీఎంర్ఫ ) ద్వారా 8 మందికి సుమారు ₹4.25 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ర్ ఓ , ఎంపీడీఓ , ఎం ఈ ఓ , ఎంపీవో , హౌసింగ్ ఏఈ , ఏపీఎం విజయ లక్ష్మి , మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు. అలాగే సర్పంచ్‌లు బట్టుపల్లి: తోలెం రమాదేవి , కరకగూడెం: పోలేబోయిన సుజాత , చిరుమల్ల: కొమరం సుగుణ , వెంకటాపురం: చౌలం కేశవరావు , చొప్పాల: తోలెం సావిత్రి , గొల్లగుడెం: ఎల్లబోయిన ముత్తమ్మ, కొత్తగూడెం: ఎర్రం పొట్టయ్య హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన రాజేంద్రనగర్ యువ క్రీడాకారిణి



**రాజేంద్రనగర్, విశాలభారతి:** మైలార్దేవ్‌పల్లి పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన యువ కిక్‌బాక్సర్ పూజారి హారిక జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచింది. ఫిబ్రవరి 4 నుండి 8 వరకు ఢిల్లీలోని కేడి జాధవ్ ఇండోర్ స్టేడియం లో నిర్వహించిన 5వ ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలలో 42 కేజీ మహిళల విభాగంలో పాల్గొన్న హారిక ఒక బంగారు పతకం, రెండు కాంస్య పతకాలు సాధించింది. అలాగే ఫిబ్రవరి 20 ,21 తేదీలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం లో జరిగిన 2వ ఎడిషన్ ముఖ్యమంత్రి కప్ 2025 పోటీలలో 42 కేజీ మహిళల విభాగంలో బంగారు పతకం సాధించి మరోసారి తన ప్రతిభను చాటుకుంది. హారిక గత రెండు సంవత్సరాలుగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని దేవ్ కిక్‌బాక్సింగ్ అకాడమీ లో కోచ్ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతోంది. ఇప్పటివరకు రెండు జాతీయ స్థాయి మరియు మూడు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించింది. తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మైపాల్ , రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ మరియు కోచ్ నర్సింగ్ రావు హారిక విజయాన్ని అభినందించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి హారికను సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమెకు నిరంతరం మార్గనిర్దేశం చేస్తున్న కోచ్ నర్సింగ్ రావు గారిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, నరసింహ, మధుసూదన్ రెడ్డి, సింహాద్రి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మధు పార్క్ రిడ్జ్ వాసులకు అండగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, విశాలభారతి :** మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్‌లో బఫర్ జోన్ మరియు నిర్మాణ అనుమతులపై తలెత్తిన వివాదాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అపార్ట్మెంట్ వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపార్ట్మెంట్ నివాసితుల భవిష్యత్తు , వారి పెట్టుబడులకు పూర్తి రక్షణ కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బిల్డర్ చేసిన తప్పులకు అమాయకపు కొనుగోలుదారులు బలికాకూడదనే దృఢసంకల్పంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లింపు బఫర్ జోన్ పరిధిలో ఉన్న ఫ్లాట్ల యజమానులకు ఈ రెండు ఆప్షన్లపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలన జరుపుతోందని పేర్కొన్నారు. బఫర్ జోన్ వివరాలు హైదర్‌గూడ 28.29 ఎకరాల్లో మరియు ఉప్పెర్పల్లి 3.10 ఎకరాల్లో కలిపి సుమారు 10 నుండి 12 ఎకరాలు బఫర్ జోన్ పరిధిలో ఉన్నట్లు వెల్లడించారు. నిర్మాణాలకు అనుమతి లేకపోయినా, బాధితులకు నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మొత్తం 44.08 ఎకరాలు హిమాయత్ సాగర్ కట్ట నుండి 500 మీటర్ల లోపల ఉన్న కారణంగా నిర్మాణ అనుమతులు లేనప్పటికీ, బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. రాజకీయ ప్రలోభాలకు గురికావద్దు కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి మాటలు నమ్మి ఆస్తులను తక్కువ ధరకు విక్రయించవద్దని ఎమ్మెల్యే గారు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో వివాదాస్పద స్థలాలకు సరైన ధర రాకపోవచ్చని హెచ్చరించారు. మీడియా సహకారం కోరుతూ అమాయక ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలనే ప్రభుత్వ సత్సంకల్పంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ విషయం వందలాది కుటుంబాల జీవితాలకు సంబంధించినదని, వాస్తవాలను ప్రజలకు చేరవేసి వారికి ధైర్యం ఇవ్వాలని మీడియా ప్రతినిధులను కోరారు.



## వెయిట్ లిఫ్టింగ్‌లో రేవంత్‌కు మొదటి స్థానం

**సికింద్రాబాద్, విశాల భారతి:** సి .యం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఎల్ .బి. స్టేడియం లో నిర్వహించారు ఈ పోటీలో సీతాఫలమండి .బీదలబస్తీ కి చెందిన జి.యం .రేవంత్ పాల్గొని 65 కేజి విభాగం లో పాల్గొని మొదటి స్థానాన్ని సాధించాడు.

## ప్రాణ భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరిగా వాడాలి




**విశాలభారతి, గోదావరిఖని:** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహించే అరైవ్-అలైవ్ రెండవ విడత కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి,ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మున్సిపల్ టీ జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై,రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని ప్రజలకు, వాహనదారులకు వివరించారు.హెల్మెట్ ధరించి వచ్చిన వాహనదారులకు పుష్పాలు అందించి అభినందించారు. అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి హెల్మెట్‌లు పంపిణీ చేసి,భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సీపీ మాట్లాడుతూ, పోలీసులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చలాన్ విధిస్తారని తెలిపారు. అయితే చలాన్ వల్ల పోలీసులకు లాభనష్టం ఏమీ ఉండదని, కానీ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగితే గాయాలు గానీ,ప్రాణ నష్టం గానీ కలిగి మీకూ,మీ కుటుంబానికీ తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.ఇంటి నుంచి వాహనంతో బయటకు వచ్చిన ప్రతిసారి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్‌ను సరిగా ధరించి,సేఫ్టీ లాక్ బిగించి వాహనం నడపాలని తెలిపారు. మీ బంధువులు, స్నేహితులు లేదా పరిచయస్తులు ఎవరైనా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తే వారికి కూడా హెల్మెట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని తెలియజేయాలని కోరారు.ప్రాణ భద్రత కోసం ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్,మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్సైరమేష్ రాముని, ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక కర్మాగార కార్మికుడు అదృశ్యం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఆనంద్ నగర్‌లోని ఇటుక తయారీ కర్మాగారంలో పనిచేస్తున్న అస్తు రామ్ మౌర్య (35) అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు అతని మేనల్లుడు సుఖ్నాథ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించడం జరిగింది . పోలీసులు తెలిపిన విరాళ ప్రకారం.. ఈ నెల 20న పనులు ముగించుకుని గదికి చేరుకుని నిద్రించిన అనంతరం, 21వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో అస్తు రామ్ గది నుండి కనిపించకపోవడం గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. అదృశ్యుడి వద్ద మొబైల్ ఫోన్ కూడా లేకపోవడం గమనార్హం. అస్తు రామ్ ఎత్తు సుమారు 5 అడుగులు 2 అంగుళాలు, గోధుమ వర్ణం, అండాకార ముఖం కలిగి ఉండగా, అదృశ్యమైన సమయంలో నల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

## మౌలిక వసతుల లోటుపై నేతల దృష్టి

- గంగారం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన
- అంగన్వాడీ సమస్యలపై దొంతి శేఖర్ ముదిరాజ్ ఆరా



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** గంగారంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల లోటుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్ స్థానిక నేతలు సమీక్ష నిర్వహించారు.హెడ్మాస్టర్ సుభాష్‌తో పాటు ఉపాధ్యాయ బృందంతో సమావేశమై తరగతి గదుల కొరత,తాగునీటి సమస్య, మరుగుదొడ్ల నిర్వహణ లోపాలు, ఫర్నిచర్ అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన వసతులు సమకూర్చే దిశగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత, భవనాల దుస్థితి, పోషకాహార సరఫరా సమస్యలపై కూడా దొంతి శేఖర్ ముదిరాజ్ ప్రత్యేకంగా ఆరా తీశారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రభావం పడకుండా తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కేవలం ప్రకటనలకే పరిమితం కాక అమలులోనూ కనిపించాలన్నది స్థానికుల అభిప్రాయం.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భీమమ్మ, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



- సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు
- ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ పాల్గొన్నారు

**మహబూబాబాద్, విశాలభారతి:**

తెలంగాణలో ఆదివాసీల గిరిజన సమ్మక్క సారక్క జాతర ఏ విధంగానైతే జరుపుకుంటాము అదే తరహాలో శ్రీ సంతు సేవలల్ మహారాజ్ జయంతిని కూడా అంగరంగ వైభవంగా ఒక మహా జాతర లాగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవం అతను హిందూధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావునిగా భావిస్తారు సేవాలాల్ మహారాజ్ ఈ సమస్త జీవకోటికి మాతృరూపం (తల్లిగా) వెలిసిన అమ్మభవాని గురించి అమ్మను పూజించాలని, కాని ఫలితం ఆశించవద్దని బంజారా లకు బోధించారు. సంత్ సేవాలాల్ మహరాజ్‌గారు, హింస పాపమని, మత్తు, ధూమ పానం శాపం అని హితవు పలికి బంజారా జాతికే కాదు యావత్తు ఇతర కులాలకు ఆదర్శపురుసుడయ్యారు. సేవాలాల్ మహారాజ్ ఆనాడు బంజారా జాతి పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేసి ఆచరించి చూపారు. ఆ తరుణంలో బంజారాలు ఆనాడు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తూ ఉండేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లీం పాలకుల మత ప్రచారం ద్వారా బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురి అయ్యింది. ఈ పరిస్థితులలో బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారు. సేవాలాల్ మహరాజ్ బోధనల ద్వారా బంజారా జాతి అవునత్యం పెంపొందుతుందన్నారు అదేవిధంగా అనంతారంలో ఉన్నటువంటి ఈ యొక్క సంతు సేవాలాల్ మహారాజ్ గుడిని అతి త్వరలో ఈ యొక్క గుడి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు దీనిని గిరిజనుల అందరికీ అంకితం చేస్తానన్నారు. అదేవిధంగా బంజారాలందరూ ఐక్యమత్తంగా ఉండాలని ప్రతి ఒక్క తల్లి బంజారా బిడ్డకు ఈ మన యొక్క జాతిఖ్యాతిని వారికి వివరించాలని కోరారు మన బంజారా జాతిలో ఎంతోమంది ఒక మంచి స్థాయిలో ఉన్నారని వైఖ్యానించారు. ఈ యొక్క కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, వైస్ చైర్మన్ సోమయ్య, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జి .దేశీ రామ్ నాయక్, ఉత్సవాల ప్రత్యేక అధికారి జి.మరియన్న, తాసిల్దార్లు, ఎంపీడీవోలు మహబూబాబాద్ నియోజకవర్గంలోని, బంజారా సోదరులు, మహిళా మణులు, గిరిజన నాయకులు, అదేవిధంగా ప్రభుత్వ సంబంధిత ఆయా శాఖల అధికారులు, నాయకులు , పట్టణ అధ్యక్షులు పట్టణ కౌన్సిలర్లు నియోజకవర్గ సర్పంచులు ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

**కూకట్ పల్లి విశాల భారతి:**



అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. మొమిన్ పేట్ మండలం, అమ్రాదికలాన్ గ్రామంలో గత శనివారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహంపై కొందరు దుండగులు దాడి చేసి ధ్వంసం చేసిన ఘటన విధితమే. మూడు రోజులు గడుస్తున్నా ఇంకా నిందితులను గుర్తించడంలో పోలీసులు వహిస్తున్న నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం మోమిన్ పేట్ మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల మల్లేశం, జై భీమ్ యూత్ ఇండియా రాష్ట్ర నాయకులు నడిమిదొడ్డి శ్రీనివాస్, బుద్ధ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బేగరి నర్సింలు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడం అంటే రాజ్యాంగం పైన దాడి చేయడమే అవుతుందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాలపై గౌరవం లేని వ్యక్తులే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడతారని తెలిపారు. ప్రపంచవ్యాప్తమైన అంబేద్కర్ భావజాలాన్ని ఇలాంటి చిల్లర చేష్టల ద్వారా నిలువరించలేరని స్పష్టం చేశారు. ఈ దేశంలో నూటికి 85 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ, అగ్రకుల మహిళలకు అంబేద్కర్ నిలువెత్తు జీవితం అన్నారు. ఈ వర్గాల సమగ్ర అభివృద్ధికి బాటలు వేసిన అంబేద్కర్ విగ్రహాన్ని చూసి మనువాదులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా అంబేద్కర్ ఆలోచనను ఆపడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. రానున్న కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు ఏకమై వారి జీవితాలను నిలబెడుతున్న రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం సమిష్టి ఉద్యమాలు చేస్తారని తెలిపారు. సమ సమాజం వల్లనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్న అంబేద్కర్ భావజాలాన్ని సహించలేని ఉన్మాద శక్తులు ఈ సమాజాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. కానీ భారత దేశ బహుజనుల ముందు ఇవి ఏమాత్రం సాగవని హెచ్చరించారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారు ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు.

విశాల భారతి





# అదే నా డ్రీమ్ ప్రాజెక్ట్!

లాయర్ కావాలనుకొని నటిగా మారానని, తెలుగు సినిమాలకే తన తొలి ప్రాధాన్యం అని చెప్పింది కథానాయిక నయన్ సారిక. గం గం గణేశా, ఆయ్, క వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది మరాఠీ భామ. ఆమె శ్రీవిష్ణు సరసన నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ సినిమా.. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం నయన్ సారిక విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకుంది. ఈ సినిమాలో తన పాత్రపేరు మనీషా అని, కాలేజీ లెక్చరర్‌గా కనిపిస్తానని చెప్పింది. ఇద్దరు లెక్చరర్స్ నడుమ ప్రేమకథగా, వినోదంతో పాటు భావోద్వేగాలతో ఆకట్టుకునే కథాంశమిదని ఆమె తెలిపింది. 'మనీషా పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. ఓరకంగా హీరోపై డామినేటింగ్‌గా అనిపిస్తుంది. ఫస్టాఫ్‌లో నా క్యారెక్టర్ అబ్బాయిలకు కాస్త చిరాకుగా అనిపిస్తుంది. అందుక్కారణం ఏమిటో ద్వితీయార్ధంలో తెలుస్తుంది. అప్పటి నుంచి మనీషాను అందరూ ఇష్టపడతారు' అని నయన్ సారిక చెప్పింది. ప్రేక్షకుల్ని నవ్వించడం చాలా కష్టమని, ఈ విషయంలో శ్రీవిష్ణు చాలా టాలెంటెడ్ అని, ఆయన కామెడీ టైమింగ్ నేచురల్‌గా ఉంటుందని ప్రశంసించింది. ఇటీవల ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకోవడంతో తన కల నెరవేరిన అనుభూతి కలిగిందని, రాజమౌళి దర్శకత్వంలో పని చేయాలన్నది తన డ్రీం అని నయన్ సారిక తెలిపింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.